అడ్వకేట్ల అకాడమీ ఏర్పాటు చేయాలి

● సీఎంకు హైకోర్టు సీనియర్ న్యాయవాది వినతి



మాట్లాడుతున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్

చాదర్‌ఘాట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అడ్వకేట్ల నైపుణ్యాలు, ప్రమాణాలతో పాటు న్యాయ వ్యవస్థపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు వీలుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ అడ్వకేట్స్ అకాడమీ ఏర్పాటు చేయాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ విజ్ఞప్తి చేశారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి, బార్ కౌన్సిల్‌కు, కేంద్ర, రాష్ట్ర న్యాయశాఖామాత్యులకు ఆన్‌లైన్ ద్వారా ఆయన వినతిపత్రాలు సమర్పించారు. గడ్డిఅన్నారం కల్యాణ్‌నగర్ కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పోలీసులకు పోలీసు అకాడమీ, జడ్జీల కోసం జ్యుడిషియల్ అకాడమీలను ఏర్పాటు చేసిన తరహాలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 55 వేల మంది అడ్వకేట్ల కోసం అడ్వకేట్స్ అకాడమి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవనం నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన 100 ఎకరాల స్థలం ఆవరణలోనే 30 ఎకరాల్లో అడ్వకేట్స్ అకాడమీ నిర్మించేందుకు అవసరమైన రూ.50కోట్ల నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధన ఉద్యమంలో న్యాయవాదుల పాత్రను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో అడ్వకేట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తే దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందన్నారు.



సత్యసాయి బాబా శోభాయాత్రలో కమిటీ ప్రతినిధులు

వైభవంగా సత్యసాయి శోభాయాత్ర

చాదర్‌ఘాట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి సేవా సమితి దిల్‌సుఖ్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శోభాయాత్రను నిర్వహించారు. శోభాయమానంగా తీర్చిదిద్దిన రథంపై భగవాన్ సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఏర్పాటు చేసి భజన కీర్తనలు, మహిళల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది. మానవ సేవే పరమావధిగా భావిస్తూ ప్రతి ఒక్కరూ ఏదొక సేవ కార్యక్రమం చేయడం అలవాటు చేసుకోవాలని కమిటీ ప్రతినిధులు బురుగు కృష్ణ, రామారావు, శ్రీనివాస్ సూచించారు.

బాధిత కుటుంబీలకు చేయూత

హయత్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ కార్మికుడు ఎస్ఎస్ చారి మృతిచెందగా.. అతని కుటుంబానికి రూ. 1.10 లక్షలను తోటి కార్మికులు డిపో మేనేజర్ విజయ్ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, నరేష్, మహిపాల్, సతీష్, వెంకటయ్య, వెంకటేష్, ఉదయశ్రీ, కరుణ, ఎంఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వందేమాతరం' ఆలాపన

సరూర్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 150 వసంతాల వందేమాతరం వేడుకల్లో భాగంగా శనివారం సామూహిక గీతాలాపన కార్యక్రమం సందడిగా కొనసాగింది. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని సిరిపురం యాదయ్య ప్లే గ్రౌండ్‌లో బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన రెండు వేల మంది విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ వందేమాతరం గీతం ఆలపించారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు నడికుడ యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తర్రె మల్లేశ్‌యాదవ్, జిల్లా నాయకుడు గుర్రం మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్లు బంగారు అనితాప్రభాకర్, నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లోనూ..

మన్సూరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యంలో కీలక భూమిక పోషించిన గీతం 'వందేమాతరం' అని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. వందేమాతరం జాతీయ గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆర్కేపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముంత రాములుయాదవ్ ఆధ్వర్యంలో డివిజన్‌లో ఉన్న వివిధ విద్యాసంస్థల్లో సామూహిక వందేమాతరం గీతాలాపనను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా అందెల శ్రీరాములు యాదవ్, స్థానిక కార్పొరేటర్ వి.రాధధీరజ్‌రెడ్డి హాజరయ్యారు. సరూర్‌నగర్‌లోని వీఎం హోమ్‌లో... బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ విచ్చేశారు.



ఎగ్జిబిషన్‌లో యువతులు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ మేళా ఆకట్టుకుంటుంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్ శారీస్, డిజైనర్ శారీస్, కాంతా వర్క్స్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నో చికెన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్, ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు అక్బర్ అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసేలా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రదర్శన రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

నాదర్‌గుల్ స్కూల్‌లో 'బేటీ బచావో బేటీ పఢావో'

సరూర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాలాపూర్ మండలం నాదర్‌గుల్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షించుకోవాలని, వారికి విద్యాబుద్ధులు నేర్పించి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, స్కూల్ హెడ్మాస్టర్ సత్తయ్య, అంగన్‌వాడీ టీచర్లు కె.కవిత, సునీత, కల్పలత, మాణిక్యమ్మ, మంజుల పాల్గొన్నారు.

● గెలుపు



అండర్ -14 ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల బాలిక జట్టు మొదటి బహుమతి సాధించింది. బాలికలను జోనల్ సెక్రటరీ నిర్మల, పీడీలు చంద్రమోహన్, జగన్‌మోహన్‌రెడ్డి, కోచ్ నీలేష్‌లు అభినందించారు.

-(హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి)

● గోడు



హయత్‌నగర్ డివిజన్ గుండా ఉన్న ట్రంకు లైను మురుగు ఒత్తిడి కారణంగా రోజులో ఏదో ఒక చోట పగులుతోంది. ఈసారి కల్వంచ శాంతి నగర్ వంతైంది. వనస్థలిపురం పై కాలనీ నుంచి వచ్చే మురుగు నీటి కోసం ఏర్పాటు చేసిన ట్రంకు లైను పాత పడటం ప్రధాన కారణం. శనివారం శాంతినగర్‌లో కుంగిన మ్యాన్‌హోల్ కారణంగా రోడ్లన్నీ దుర్గంధ భరితంగా మారాయి. ఏఈ వాహిని, కమిషనర్ రవీందర్‌రెడ్డిలు ఇక్కడికి చేరుకుని రెండు రోజుల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

- హయత్‌నగర్, (ఆంధ్రజ్యోతి):

పేద విద్యార్థులంటే అంత చులకనా?

● కిటికీలకు అద్దాలు లేకపోవడంపై ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం
● నాదర్‌గుల్ గురుకుల్ స్కూల్, వసతి గృహం ఆకస్మిక సందర్శన
● పది రోజుల్లో సదుపాయాలు కల్పించాలని ఆదేశం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులంటే అంత చులకనా? అని వార్డెన్‌పై ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గదుల కిటికీలకు అద్దాలు లేకపోవడం చూసి అవాక్కయ్యారు. విషయాని కొస్తే.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో కొనసాగుతున్న కందుకూరు గురుకుల్ స్కూల్, వసతి గృహాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. స్కూల్ ఎదురుగా మురుగు నీటి కాలువ, మడుగు ఉండటం గమనించిన ఆమె.. ఇలా ఉంటే దోమలు వ్యాప్తి చెందవా.. రోగాలు రావా..? అని నిలదీశారు. భవనం యజమాని అభ్యంతరం వల్లే డ్రైనేజీ సమస్య తలెత్తిందని స్కూల్ ప్రిన్సిపాల్ పేర్కొనగా యజమానిని పిలిపించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పిల్లలకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించి.. ఇంకా నాణ్యతగా వంట తయారు చేయాలని, వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పది రోజుల్లోగా ఇక్కడి సమస్యలన్నీ పరిష్కారం కావాలని, లేని పక్షంలో సంబంధీకులందరిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ యెల్చల మమతాసుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కోటగిరి జంగయ్య, గడ్డం కృష్ణారెడ్డి, బొద్రమోని శ్రీరాములుముదిరాజ్, నరేశ్, దండు యాదయ్య, సుధాకర్‌యాదవ్, డి.లక్ష్మయ్య, బోయపల్లి శేఖర్‌రెడ్డి, లోకసాని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మన్సూరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): 35వ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు నాగోల్ బండ్లగూడ.. శ్రీచైతన్య పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు భార్గవ్‌తేజ్, మణిసాయిలను పాఠశాల డైరెక్టర్ రాంరెడ్డి అభినందించారు. అయ్యప్ప సొసైటీ మాదాపూర్ సీజీఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 16న నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఉత్తమ ప్రతిభకనబరిచిన వీరు డిసెంబర్ 5 నుంచి 7వ తేదీల్లో మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో నిర్వహించే 35వ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మమత, వ్యాయామ ఉపాధ్యాయుడు గోపి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

● రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు సహకారంగా ఉంటూ ఎక్కువ కేసులు పరిష్కరించడంలో ప్రభుత్వ సహాయక న్యాయవాదులు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్ సూచించారు. రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ప్రభుత్వ సహాయక న్యాయవాదులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు కేసులు, వాటి పరిష్కారం పట్ల న్యాయమూర్తులు మోహినుద్దీన్, బాలకృష్ణతో కలిసి ఆయన.. పలు సూచనలు, సలహాలు చేశారు. బ

సైబర్ నేరాల నివారణపై అవగాహన అవసరం

సంతోష్‌నగర్, నవంబరు22(ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన అవసరమని సౌత్‌ఈస్ట్ జోన్ సైబర్‌సెల్ ఎస్ఐ ఎస్.మల్లేష్ అన్నారు. శనివారం కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓ గ్రౌండ్‌లో మార్నింగ్ వాకర్స్‌కు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. వాటి నివారణ పట్ల ప్రజలు అవగాహన కలిగిఉండాలన్నారు.

సెల్‌టవర్ నిర్మాణం అడ్డగింత

కొత్తపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య ఏర్పాటు చేయబోయిన సెల్ టవర్ నిర్మాణాన్ని శనివారం కొత్తపేట న్యూనాగోల్ వాసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్ ఇక్కడి చేరుకొని సెల్‌టవర్‌తో పరిసర ప్రాంతాల్లో ఉండే ప్రజల ఆరోగ్యంపై ప్రభావం ఉంటుందన్నారు. వెంటనే దాని ఏర్పాటును నిలిపివేసే చర్యలు తీసుకోవాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు చెప్పారు.

చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలి

● సినీ నటుడు నితిన్ భార్య షాలినీ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెంలోని డిస్కవరి ఓక్స్ స్కూల్ 2వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఫ్యాషన్ డిజైనర్, సినీ దర్శకురాలు నీరజకోనా, సినీ హీరో నితిన్ భార్య షాలీని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు షాలినీ సూచించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతిలో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. స్కూల్ డైరెక్టర్ నీలిమా, ప్రిన్సిపాల్ సారా అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు సీజ్

మన్సూరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కాలనీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ షెడ్డును జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తే నోటీసులు అందించి సీజ్ చేస్తామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయలక్ష్మి తెలిపారు. సీజ్ చేసిన షెడ్డుకు సంబంధించి ఇదివరకే నోటీసులు ఇచ్చామని, అయినా నిర్మాణం కొనసాగించడంతో సీజ్ చేశామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 40 మందికి కౌన్సెలింగ్

కొత్తపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో వాహనాలు నడపడం ఇతరులకూ ప్రమాదకరమని టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్పీటీ అమరవర్ధన్‌రెడ్డి తెలిపారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 40 మందికి కుటుంబ సభ్యుల సమక్షంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.

● రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును ఇబ్రహీంపట్నం ప్రైవేటు స్కూల్ నుంచి 72 మంది విద్యార్థులు సందర్శించారు. 2 విడతలుగా అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.



పవనగిరి కాలనీ ఫేజ్-3లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఇదే రోడ్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

పోటాపోటీ

● వేర్వేరుగా సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం
● ఉదయం ఎమ్మెల్యే, మధ్యాహ్నం కార్పొరేటర్

హయత్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియా పవనగిరి కాలనీ ఫేజ్-3లో రూ. 33 లక్షలతో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును శనివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి వేర్వేరు సమయాల్లో ప్రారంభించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 1.30 నిమిషాలకు కార్పొరేటర్ నర్సింహారెడ్డి ప్రారంభించారు.

ఎవరెంటో అందరికీ తెలుసు: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వీరన్నగుట్ట కాలనీ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బొమ్మలగుడి మొదలుకుని పాపయ్యగూడ వరకు ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డు విస్తరణ జరగాల్సి ఉందని దానికి ప్రజలు, గృహ యజమానులు సహకరించాలని కోరారు. శివగంగ కాలనీతో పాటు అనేక కాలనీలలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు అన్నీ పూర్తి చేయిస్తానన్నారు. అక్రమ నిర్మాణాలదారులు, కబ్జారాయుళ్ల నుంచి డబ్బులు ఎవరు వసూలు చేస్తున్నారో స్థానిక ప్రజలందరికీ తెలుసునని కార్పొరేటర్‌ను ఉద్దేశించి ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, యువ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, టంగుటూరి నాగరాజు, ఆనంద్‌యాదవ్, ధనలక్ష్మి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్‌రావు, నర్సింహుడు, హరినాథ్‌నేత, ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధికే ప్రాధాన్యం : కార్పొరేటర్ కొప్పుల

డివిజన్‌లో తాను అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తానని కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అన్నారు. పవనగిరి కాలనీ ఫేజ్-3లో సీసీ రోడ్డును శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 40 కాలనీల్లో 70 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశానన్నారు. విజయవాడ జాతీయ రహదారి నుంచి వయా బొమ్మలగుడి మీదుగా రూ.3 కోట్లతో 23 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులపై దృష్టి పెట్టి త్వరితగతిన పూర్తి చేస్తానన్నారు. సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన రచయిత రమాకాంత్

● పవర్ ప్లే..కు అవార్డు దక్కిందని వెల్లడి



రమాకాంత్‌ను అభినందిస్తున్న కేటీఆర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పవర్ ప్లే పుస్తకానికి దక్కిన అవార్డుతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి రచయిత రమాకాంత్ శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను కేటీఆర్ శాలువాతో సన్మానించారు. 'పవర్ ప్లే' పుస్తకానికి ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు వరించిందని, రాజకీయ వ్యూహాలపై తెలుగు, హిందీ భాషల్లో ఇప్పటివరకు 16పుస్తకాలు రచించిన తొలి భారతీయ రచయితగా తనకు గౌరవం లభించిందని రావినూతల రమాకాంత్ తెలిపారు.



తుర్కయంజాల్‌లో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో

● లేబర్‌కోడ్‌ల నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్

హయత్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. తుర్కయంజాల్.. నాగార్జునసాగర్ జాతీయ రహదారిలో ఉన్న హయత్‌నగర్ బస్సు డిపో ఎదుట సంఘం నేతలు నిర్వహించిన నిరసనలో వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం-పని పరిస్థితుల కోడ్‌లను నవంబరు-1 నుంచి అమలు చేయడాన్ని సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని నేతలు అన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నరహరి, నరసింహ, సత్యనారాయణ, మధు, యాదయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ : నాలుగు లేబర్‌కోడ్‌ల నోటిఫికేషన్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని హస్తినాపురం నందనవనం చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. కార్మికవర్గ ప్రయోజనాలకు నష్టం కలిగించే చట్టాలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు.

పారిశుధ్య కార్మికులకు స్వెటర్ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు శనివారం స్వెటర్లను పంపిణీ చేశారు. గుండోజి రంగదాసు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందికంటి విజయ్‌కుమార్ వీటిని అందజేశారు. గ్రామ స్వచ్ఛతలో పారిశుధ్య కార్మికులదే కీలక పాత్ర అని అన్నారు

భగవద్గీతపై పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని శ్రీఅక్షర, వికాస్ పాఠశాలలో భగవద్గీతపై ఆదివారం నిర్వహించే పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు సీహెచ్‌వీఆర్‌కే మూర్తి తెలిపారు. గురువారం వనస్థలిపురంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు భగవద్గీతపై ఆసక్తిని పెంచుకుని పోటీల్లో రాణించాలన్నారు. ఈ పరీక్ష 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు గుణత్రయ విభాగయోగం 14వ అధ్యాయంలోని 27 శ్లోకాలలో ఏవైనా 20 శ్లోకాలు, వాటి తాత్పర్యాలు రాయాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు దైవాసుర సంపద్విభాగ యోగం 16వ అధ్యాయంలోని 24 శ్లోకాల్లో ఏవైనా 20 పాటు వాటి తాత్పర్యాలు రాయాలని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ, మీర్‌పేట్ ప్రాంతాల్లో గల కాలనీల్లో ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ, అయోధ్యనగర్, ఎంఎల్ఆర్‌కాలనీ, తిరుమలా ఎన్‌క్లేవ్, అనురాగ్‌నగర్ కాలనీల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రతినిధులు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా వంటి సమస్యలపై సంబంధిత విభాగాల అధికారులతో చర్చించి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని చల్లా పేర్కొన్నారు. కార్యక్రమంలో 36వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెడ్ల మల్లేశ్‌ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సిద్ధేశ్వర్, ఓంప్రకాశ్, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అమాయకులను అడ్డుపెట్టుకొని రాజకీయమా?

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి మండిపాటు



షెడ్డు వద్ద ఆందోళన చేపడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మన్సూరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజలను అడ్డుపెట్టుకుని తమ ప్రజాప్రతినిధులపై రాజకీయ ప్రతీకారం తీర్చుకోవాలని చూడటం సిగ్గుచేటని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. మన్సూరాబాద్‌లో ఎమ్మెల్యే ప్రోద్బలంతో అధికారులు రాత్రికి రాత్రి వచ్చి ఓ నిర్మాణాన్ని సీజ్ చేశారని ఆరోపిస్తూ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. అమాయక ప్రజలకు అన్యాయం జరిగేలా అధికారులు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో పనిచేయడం సరికాదని వనపల్లి అన్నారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక, రాజకీయంగా ఎదుర్కోలేక డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే దుశ్చర్యలకు పాల్పడుతున్నాడన్నాడు. ఆయన అడుగులకు మడుగులొత్తేలా అధికారుల వైఖరి స్పష్టంగా తెలుస్తోందని, తన ప్రాంత ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోబోనన్నారు. అనంతరం సరూర్‌నగర్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున్‌రావును కలిసి షెడ్డు సీజ్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే, అతని అనుచరులు చేపడుతున్న పలు అక్రమ నిర్మాణాలను వారి దృష్టికి తీసుకెళ్లి వాటిపైనా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పలువురు బీజేపీ జిల్లా, డివిజన్ల నాయకులు తదితరులు ఉన్నారు.